క్లుప్తంగా

గ్రామాభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ



ఇబ్రహీంపట్నం: గ్రామాభివృద్ధి ప్రణాళికలు, గ్రామాల్లో పేదరికం తగ్గింపు ప్రణాళికలపై వీఓలు, గ్రామ పంచాయతీ అధికారులకు ఇబ్రహీంపట్నం వెలుగు కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. స్వయం సహాయక సంఘాల స్థాయి, గ్రామ పంచాయతీలు, మండల స్థాయిలో ప్రణాళికల తయారీపై శిక్షణ ఇచ్చారు. సామాజిక సంక్షేమ కార్యక్రమాలు, జీవనోపాధి అంశాలను గుర్తించడం, పారిశుద్ధ్యం, రోడ్లు, నీటి సరఫరా వంటి అభివృద్ధి అంశాలపై దృష్టి సారించి ప్రణాళికలు రూపొందించాలని డెప్యూటీ ఎంపీడీఓ మనోజ్ కుమార్ వివరించారు. డీపీఎం అమ్మిశెట్టి శ్రీనివాసరావు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీఎం శోభన్‌బాబు, స్వయం సహాయక సంఘాల సీసీలు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

తిరువూరురూరల్: పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం చిట్టేల, ఆంజనేయపురం గ్రామాల్లో పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. పశు సంవర్థక శాఖ సంయుక్త సంచాలకులు హనుమంతరావు వైద్య శిబిరాన్ని సందర్శించారు. సీజనల్ వ్యాధులు రాకుండా పశువులకు ముందస్తుగా టీకాలు వేయించాలని పశు యజమానులకు ఆయన సూచించారు. పశు వైద్యాధికారులు శ్వేత పాల్గొన్నారు.

వర్షానికి రోడ్లు జలమయం

మైలవరం: మైలవరంలో శుక్రవారం అకస్మాత్తుగా మబ్బులు కమ్ముకుని వర్షం కురిసింది. రహదారులు జలమయమయ్యాయి. మైలవరంలోని ప్రధాన రహదారి, మైలవరం నుంచి చంద్రాల వెళ్లే ఆర్ అండ్ బీ రహదారులు వర్షం నీటితో నిండి వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వెల్వడం వద్ద రహదారి గుంతల మయంగా మారడంతో వాహన చోదకులు అవస్థలు పడ్డారు.

సచివాలయ కార్యదర్శి అదృశ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సచివాలయ కార్యదర్శి అదృశ్యమైన ఘటన విజయవాడ బీసెంట్ రోడ్డులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జి. కొండూరు మండలం వెలగలేరు గ్రామానికి చెందిన గజ్జల లక్ష్మీతిరుపతమ్మ హెచ్. ముత్యాలంపాడు సచివాలయ కార్యదర్శిగా పనిచేస్తోంది. నాలుగు నెలల క్రితం విజయవాడ బీసెంట్ రోడ్డులోని డివిజనల్ పంచాయతీ కార్యాలయానికి డెప్యూటేషన్‌పై వచ్చింది. ప్రతి రోజూ ఉదయం ఆమె భర్త సుబ్బారావు వెలగలేరు నుంచి బైక్‌పై ఎక్కించుకొని డీఎల్‌పీఓ కార్యాలయానికి తీసుకువచ్చేవాడు. సాయంత్రం విధులు పూర్తి చేసుకున్న తర్వాత తిరిగి బైక్‌పై తీసుకెళ్లేవారు. రోజూ మాదిరిగానే గురువారం లక్ష్మీతిరుపతమ్మ భర్త ఆమెను డీఎల్‌పీఓ కార్యాలయం వద్ద దించి వెళ్లాడు. సాయంత్రం తిరిగి ఇంటికి తీసుకెళ్లేందుకు ఆఫీసు వద్దకు వెళ్లగా ఆమె ఆఫీసులో లేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. ఆమె భర్త ఫిర్యాదు మేరకు గవర్నర్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు.

సమస్యలు పరిష్కరించాలి

మైలవరం: కళాకారుల సమస్యలు పరిష్కరించాలని ప్రజానాట్యమండలి సీనియర్ కళాకారుడు వి.వెంకటరత్నం డిమాండ్ చేశారు. ప్రజానాట్యమండలి ఎన్టీఆర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కళాకారుల సమావేశం శుక్రవారం రెడ్డిగూడెం మండలం శ్రీరాంపురం గ్రామంలో జరిగింది. జిల్లా అధ్యక్షుడు జీవీ రంగారెడ్డి మాట్లాడుతూ జన జాగృతే కళల పరమార్థమన్నారు. సమస్యల పరిష్కారం కోసం కళాకారులు ఐక్యంగా ఉద్యమించాలని చెప్పారు. జిల్లా సహాయ కార్యదర్శి పంబి వెంకటేశ్వరరావు, తిరువూరు రూరల్ మండల అధ్యక్ష, కార్యదర్శులు డి. ఏసుపాదం, ఎస్. వెంకటేశ్వర్లు, ఎ.కొండూరు మండల అధ్యక్షుడు చింతిరాల విక్టర్, బుర్రకథ కళాకారుల సంక్షేమ సమాఖ్య నాయకులు మాట్లాడారు.

శాకంబరిగా అమ్మవార్లు

మైలవరం: ఆషాఢ మాసం సందర్భంగా మైలవరంలోని కోదండ రామాలయంలో కనక దుర్గమ్మ అమ్మవారిని శుక్రవారం కూరగాయలతో శాకంబరీదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా సాయంత్రం కుంకుమ పూజ, లలిత సహస్ర నామ పారాయణ జరిగాయి. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

- చాట్రాయి: ఆషాఢ మాసం సందర్భంగా మండలంలోని ఆరుగొలనుపేట గ్రామంలోని లక్ష్మమ్మ అంకమ్మ అమ్మవార్లు శుక్రవారం శాకంబరిదేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున మహిళలు అమ్మవార్లకు సారె సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు

వాహనాల తనిఖీ

ఆగిరిపల్లి: మైనర్లు వాహనాలు నడిపితే వాహన యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శుభశేఖర్ హెచ్చరించారు. విజయవాడ రోడ్డులో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్, లైసెన్స్ లేని వాహనదారులపై కేసులు నమోదు చేశారు.

స్టీల్ ప్లేట్లు అందజేత

కేతనకొండ(ఇబ్రహీంపట్నం):కేతనకొండ శివారు గొల్లపూడి మోడల్ ప్రాథమిక పాఠశాల ఉర్దూ ఉపాధ్యాయుడు మొహమ్మద్ ఇర్ఫాన్ పాషా అభ్యర్థన మేరకు విజయవాడ మొగలరాజపురానికి చెందిన దాత అరుణ్‌కుమార్ విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి సమకూర్చిన స్టీల్ ప్లేట్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఎంఈఓ-2 ఎం.వీరాస్వామి, పాఠశాల హెచ్‌ఎం భవాని, సీఆర్పీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పొలాలకు దారేది..

- ముళ్ల పొదలతో అధ్వానంగా మారిన సావరాల డొంక రోడ్డు
- సాగు భూముల్లోకి వెళ్లే దారిలేక అవస్థలు పడుతున్న రైతులు
- దశాబ్దాల సమస్యకు పరిష్కారం చూపాలంటూ వినతి





ఆత్కూరు గ్రామంలో సాగు భూములకు వెళ్లే సావరాల డొంక రోడ్డుపై ముళ్ల పొదలు : ముళ్ల చెట్లతో నడిచేందుకు కూడా వీలు లేని సావరాల డొంకరోడ్డు

జి.కొండూరు: జి.కొండూరు మండల పరిధిలోని ఆత్కూరు గ్రామంలో సాగు భూముల్లోకి వెళ్లే సావరాల డొంకరోడ్డు అభివృద్ధికి నోచుకోక రైతులు నరకయాతన పడుతున్నారు. దశాబ్దాల కిందట ఏర్పాటు చేసిన ఈ డొంక రోడ్డు ముళ్లపొదలు, తుమ్మచెట్లతో నిండిపోయి నడవడానికి కూడా వీలు పడక రైతులు అవస్థలు పడుతున్నారు. సాగు భూముల్లోకి ఎరువులు, విత్తనాలు తరలించాలన్నా, పంటల ఉత్పత్తులను తరలించాలన్నా డొంక రోడ్డు అధ్వానంగా ఉండడంతో సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కొద్దిపాటి శ్రద్ధ చూపి ఈ డొంకరోడ్డును అభివృద్ధి చేస్తే వందల ఎకరాల సాగు భూములకు రాకపోకల సమస్య పరిష్కారమవుతుందని రైతులు కోరుతున్నారు.

200 ఎకరాలకు పైగా..

ఆత్కూరు-హెచ్.ముత్యాలంపాడు గ్రామాల మధ్య ప్రధాన రహదారి నుంచి వ్యవసాయ భూములకు వెళ్లేందుకు రెండు కిలోమీటర్ల మేర సావరాల డొంక రోడ్డు ఉంది. ఈ రోడ్డుకు ఇరువైపులా ఆత్కూరు, హెచ్.ముత్యాలంపాడు, వెల్లటూరు గ్రామాలకు చెందిన 200 ఎకరాలకుపైగా వ్యవసాయ భూములు ఉన్నాయి. రైతులు, కూలీలు ప్రతి రోజూ వందలాది మంది ఈ రోడ్డుపై రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రోడ్డు ప్రారంభం నుంచి బాగానే ఉన్నప్పటికీ మిగిలిన రోడ్డు అధ్వానంగా మారింది. వర్షాలు పడుతున్న సమయంలో ఈ రోడ్డుపై నడిచేందుకు కూడా వీలు లేక రైతులు వ్యవసాయ భూముల్లోకి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డును అభివృద్ధి చేయడంతో పాటు రెండు చోట్ల చప్టాలు నిర్మిస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

నడవడానికి కూడా వీలులేదు



మా పొలాలకు వెళ్లేందుకు దారిలేక నరకయాతన పడుతున్నాం. సావరాల చెరువు కింద నాకు రెండు ఎకరాల పొలం ఉంది. డొంక రోడ్డు ఉన్నప్పటికీ ముళ్ల పొదలతో నిండిపోయి నడవడానికి వీలులేదు. పొలంలోకి మందు కట్టలు తీసుకెళ్లాలంటే చుక్కలు కనపడుతున్నాయి. డొంక రోడ్డుని గ్రావెల్‌తో అభివృద్ధి చేస్తే మాకు ఇబ్బందులు తప్పుతాయి

– గంగుల తిరుపతిరావు, రైతు, ఆత్కూరు గ్రామం

మా పొలాలకు దారి చూపాలి



మా పొలాలకు వెళ్లేందుకు డొంక రోడ్డు ఉన్నప్పటికీ అభివృద్ధికి నోచుకోక నడవడానికి కూడా వీలు పడడంలేదు. నాకు రెండు ఎకరాల పొలం ఉంది. పొలంలోకి మందు కట్టలు, విత్తనాలు తీసుకెళ్లాలన్నా వీలు లేకుండా పోయింది. పంట పండిన తర్వాత ధాన్యం, గడ్డిని తరలించడానికి తిప్పలు తప్పడం లేదు. డొంక రోడ్డును వెంటనే అభివృద్ధి చేయాలి.

– పటాపంచల గోపాలరావు, రైతు, ఆత్కూరు గ్రామం

డొంక రోడ్డును అభివృద్ధి చేయాలి



రైతులు పొలాలకు వెళ్లే సావరాల డొంక రోడ్డును అభివృద్ధి చేస్తే ఇబ్బందులు తప్పుతాయి. ఈ డొంక రోడ్డు నడవడానికి కూడా వీలు లేకుండా పోయింది. కొదిపాటి శ్రద్ధ చూపి గ్రావెల్‌తో అభివృద్ధి చేస్తే రైతులకు మేలు జరుగుతుంది. రోడ్డు లేకపోవడంతో పొలాల గట్లపై నడవాల్సి వస్తోంది.

– పోతురాజు సురేష్, రైతు, ఆత్కూరు గ్రామం

నిబంధనల మేరకే ఎరువులు విక్రయించాలి

ఆర్డీఓ కావూరి చైతన్య



జి.కొండూరు: ప్రభుత్వ నిబంధనల మేరకే ఎరువులు, పురుగు మందుల విక్రయాలు జరపాలని విజయవాడ ఆర్డీఓ కావూరి చైతన్య అన్నారు. జి.కొండూరు మండలంలోని పలు ఎరువుల దుకాణాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్డీఓ మాట్లాడుతూ గోడౌన్ స్టాక్, ఈపాస్ స్టాక్‌కు వ్యత్యాసం ఉండకూడదని, నిర్ణయించిన ధరకే విక్రయించాలని చెప్పారు. వ్యాపారులు ఎరువులను బ్లాక్ మార్కెట్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నానో ఎరువులపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అనంతరం గడ్డమణుగు లోయలో రాతి క్వారీని పరిశీలించి నిబంధనల మేరకే క్వారీలు నిర్వహించాలన్నారు. జి.కొండూరులో ఎస్సీ బాలుర హాస్టల్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. తహసీల్దార్ సీహెచ్ వెంకటేశ్వర్లు, డీటీ విజయబాబు, ఏఓ సూరిబాబు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల పరిశీలన

మైలవరం: మైలవరంలోని ఎరువులు, పురుగు మందుల షాపులను రైతు సంఘం మండల నాయకులు పీవీ ఆంజనేయులు, రావుల సుబ్బారావు శుక్రవారం పరిశీలించారు. దుకాణదారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. నిబంధనల ప్రకారం రైతులకు ఎరువులు, పురుగుమందులు విక్రయించాలని వారు కోరారు. రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

రాక్షస పాలనకు చరమగీతం పాడుదాం



సమావేశంలో మాట్లాడుతున్న జోగి రమేష్, పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ జోగి రమేష్

జి.కొండూరు: ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి దాడులు, హత్యలు, అక్రమ కేసులతో రాష్ట్రాన్ని రావణ కాష్టంలా మార్చిన కూటమి ప్రభుత్వ రాక్షస పాలనకు చరమగీతం పాడేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధమవ్వాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ జోగి రమేష్ అన్నారు. జి.కొండూరులో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమంపై పార్టీ శ్రేణులతో విస్తృత స్థాయి సమావేశాన్ని పార్టీ మండల అధ్యక్షుడు జడ రాంబాబు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గుర్తుచేసేందుకు స్క్రీన్ ప్రజెంటేషన్ చేయించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమలైన పథకాలు, ప్రస్తుత ప్రభుత్వం పథకాలను ఇవ్వకుండా చేస్తున్న మోసాన్ని కళ్లకు కట్టినట్లు పార్టీ శ్రేణులకు చూపించారు. జోగి రమేష్ మాట్లాడుతూ నాయకులంతా గడప గడపకు వెళ్లి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. మూడు పార్టీలు, ముగ్గురు నాయకులు, మూడు అజెండాలతో రాష్ట్ర ప్రజలను నట్టేట ముంచారని విమర్శించారు. రాష్ట్రంలో ఇన్ని అరాచకాలు జరుగుతుంటే ప్రశ్నిస్తానన్న నాయకుడు కనిపించకుండా పోయాడని ఎద్దేవా చేశారు. ప్రపంచంలో ఏది జరిగినా తానే చేశానని చెప్పుకునే చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలను ఎందుకు అమలు చేయలేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాది కాలంలోనే కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత ఏ స్థాయిలో ఉందో ఇటీవల చంద్రబాబు చేయించుకున్న ఐదు సర్వేలలోనే వెల్లడైందని చెప్పారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే చంద్రబాబుకు డిపాజిట్‌లు కూడా రావని ధీమా వ్యక్తంచేశారు. వైఎస్సార్ సీపీ శ్రేణులంతా కలిసిమెలిసి జగనన్నను ముఖ్యమంత్రిని చేయడానికి కృషి చేద్దామన్నారు. ఇప్పుడు జెండా పట్టుకొని నిలబడిన ప్రతి కార్యకర్త రేపు జగనన్న పాలనలో ప్రజా ప్రతినిధులుగా మారుతారని భరోసా ఇచ్చారు. సంక్షేమ పథకాలను అమలు చేయకుండా డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతూ చంద్రబాబు చేస్తున్న మోసాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ జగనన్న చేసిన మంచిని వివరిస్తూ ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు సూచించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వేములకొండ తిరుపతిరావు, ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ, జిల్లా పరిషత్ సభ్యుడు మందా జక్రధరరావు, సర్పంచ్ మండల అరుణ, కేడీసీసీ మాజీ వైస్ చైర్మన్ వేములకొండ రాంబాబు, వైస్ ఎంపీపీ పుప్పాల సుబ్బారావు, పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మేడపాటి నాగిరెడ్డి, ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు పచ్చగోళ్ల పండు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన టెక్నాలజీపై అవగాహన పెంపొందాలి

మైలవరం: నూతన టెక్నాలజీపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు పేర్కొన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల వర్క్‌షాపు శుక్రవారం నిర్వహించారు. కళాశాల అధ్యాపకులు డాక్టర్ పి. వెంకటరావు రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. హెచ్‌పీసీ విశిష్టత, ఉద్యోగ అవకాశాలు, నూతన టెక్నాలజీ ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. ఇన్‌చార్జి విభాగాధిపతి డాక్టర్ జీఎల్ఎన్ మూర్తి, కో-ఆర్డినేటర్‌గా టి. అనిల్‌రాజు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్ విభాగం అధ్యాపకులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

మైలవరం: మైలవరంలోని వీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బోటనీ సబ్జెక్టు బోధించేందుకు గెస్ట్ లెక్చరర్ పోస్టుకు ఆసక్తిగల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ సాంగా సరళకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు కనీసం 50 శాతం మార్కులతో ఎమ్మెస్సీ(బోటనీ) మాస్టర్స్ డిగ్రీ కలిగి ఉండాలన్నారు. ఆసక్తిగల వారు తమ బయోడేటా, అర్హతలతో కూడిన దరఖాస్తులను ఈ నెల 21వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోగా కళాశాల కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

చాట్రాయి: ఆయిల్‌పామ్ సాగు పెంచేందుకు రైతులకు ఉచితంగా మొక్కలు అందిస్తున్నామని ఉద్యాన శాఖాధికారి హేమ అన్నారు. మండలంలోని బూరుగుగూడెంలో రైతులకు అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గోద్రేజ్ కంపెనీ ఉచితంగా మొక్కలు, 4 సంవత్సరాల పాటు ఎరువుల నిర్వహణ, అంతర పంటల సాగుకు 50 శాతం రాయితీ అందిస్తోందని వివరించారు.

మండల సమావేశం వాయిదా

ఆగిరిపల్లి: శుక్రవారం నిర్వహించాల్సిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో అభివృద్ధి పనులను మండలంలోని ఎంపీటీసీలకు అప్పగించడం లేదని, ఈ విషయాన్ని ఎన్నిసార్లు అధికారులకు తెలిపినా సహకరించకపోవడంతో నిరసనగా శుక్రవారం జరగాల్సిన మండల పరిషత్ సమావేశంలో పాల్గొనడం లేదని ఎంపీటీసీ సభ్యులు తెలిపారు. కోరానికి సరిపడా సభ్యులు లేకపోవడంతో ఎంపీడీఓ బి.భార్గవి సమావేశాన్ని వాయిదా వేశారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

నూజివీడు ట్రిపుల్ ఐటీ ఎస్ఐ రాంబాబు హెచ్చరిక



నూజివీడు: విద్యార్థులు చదువుపై దృష్టి సారించి శ్రద్ధగా చదువుకోవాలని, ర్యాగింగ్ దూరంగా ఉండాలని నూజివీడు ట్రిపుల్ ఐటీ ఎస్ఐ జి. రాంబాబు పేర్కొన్నారు. పీయూసీ ప్రథమ సంవత్సర విద్యార్థులకు నిర్వహిస్తున్న ఓరియంటేషన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ర్యాగింగ్, మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలు, సోషల్ మీడియా వల్ల కలిగే దుష్ఫలితాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ర్యాగింగ్ చేసి ఒకరు బాధపడుతుంటే మిగిలిన వారందరూ సంతోషించడం అనాగరిక చర్య అని అన్నారు. ఇలా చేయడం నేరమని, దీనికి చట్టప్రకారం శిక్ష తప్పదన్నారు. ర్యాగింగ్‌లకు పాల్పడి విద్యార్థులు తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని చెప్పారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాల వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని, విలువైన జీవితాలను కోల్పోవాల్సి వస్తుందన్నారు. తెలియని లింకులు, ఏపీకే ఫైల్స్ ఓపెన్ చేయడం, అపరిచిత వ్యక్తులకు ఓటీపీలు చెప్పడం వంటివి చేయొద్దన్నారు. సోషల్ మీడియాలో కొత్త వ్యక్తుల పట్ల ఆకర్షితులు కావొద్దని, వారిని నమ్మొద్దని, తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న ఆశలను వమ్ము చేయకుండా పట్టుదలతో కష్టపడి చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

మున్సిపల్ కార్మికుల వంటా వార్పు



తిరువూరులో వంటావార్పు నిర్వహిస్తున్న కార్మికులు

తిరువూరు: తమ న్యాయమైన కోర్కెలు ఆమోదించడంలో ప్రభుత్వం చూపుతున్న ఉదాసీన వైఖరికి నిరసనగా గత ఆరు రోజులుగా సమ్మె చేస్తున్న నగర పంచాయతీ కార్మికులు శుక్రవారం వంటా వార్పు కార్యక్రమం నిర్వహించారు. నగర పంచాయతీ ఎదుట ధర్నా శిబిరం ఏర్పాటు చేసిన కార్మికులు రోడ్డుపై వంటావార్పు చేశారు. ఇంజినీరింగ్ కార్మికులతో పాటు పారిశుద్ధ్య కార్మికులు కూడా సమ్మెకు దిగడంతో పట్టణంలో రోజువారీ పారిశుద్ధ్య పనులు నిలిచిపోయాయి. సీఐటీయూ నాయకులు బి. వెంకటేశ్వరరావు, ఆకుల రవి, ఎస్‌వీ భద్రం, పంతంగి శ్రీనివాసరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నాగరాజు, రఫీ, బాజీ, కందుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆరో రోజుకు కార్మికుల సమ్మె

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కొండపల్లి మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం ఆరో రోజుకు చేరింది. సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల జీతాల సమస్య పరిష్కరించాలని, మున్సిపల్ వర్కర్స్‌కు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, కార్మికులకు సంక్షేమ పథకాలు అందజేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.

నాణ్యమైన సిమెంట్‌తోనే భవనాల నిర్మాణం



బీమా బాండ్లను అందజేస్తున్న భారతి సిమెంట్ కంపెనీ ప్రతినిధులు

నూజివీడు: భవన నిర్మాణాలకు సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన నాణ్యమైన సిమెంట్‌ను ఎంపిక చేసుకోవాలని భారతి సిమెంట్ అసిస్టెంట్ మేనేజర్ (మార్కెటింగ్) సీహెచ్ కల్యాణ చక్రవర్తి అన్నారు. పట్టణంలోని శ్రీ రమణ ఎంటర్ ప్రైజెస్ డీలర్లు ఎంఆర్‌వీవీ గుప్తా, భార్గవ్ గుప్తా సహకారంతో భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో కంపెనీ సీనియర్ టెక్నికల్ అధికారి ఎస్.భవానీ శంకర్‌తో కలిసి తాపీ మేస్త్రీలు, భవన నిర్మాణ కార్మికులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారతి సిమెంట్ అధునాతన పరిజ్ఞానం, నాణ్యమైన ముడిపదార్థాలతో తయారవుతోందన్నారు. శ్లాబ్ వేసిన వారం రోజుల తరువాత కంపెనీ ప్రతినిధులు వచ్చి నాణ్యత పరీక్షలు చేసి భవన నిర్మాణ మేస్త్రీలు, యజమానులకు పలు అంశాలను వివరిస్తారని చెప్పారు. పలువురు మేస్త్రీలు, భవన నిర్మాణ కార్మికులకు రూ.లక్ష చొప్పున బీమా సదుపాయం కల్పించి బాండ్లను అందజేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): గుంటుపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.1.05 లక్షల విలువైన చెక్కులను మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ శుక్రవారం అందజేశారు. గ్రామపంచాయతీ రూ.6.40 లక్షల నిధులతో కొనుగోలు చేసిన ట్రాక్టర్‌ను ప్రారంభించారు. గ్రామంలో అంతిమయాత్ర కోసం దాత చెరుకూరి శంకరరావు రూ.17 లక్షలతో కొనుగోలు చేసి పంచాయతీకి అప్పగించిన మహాప్రస్థానం వ్యానును, మహాప్రస్థానం వ్యాను ఉంచేందుకు మరో దాత చెరుకూరి వెంకట రాయుడు రూ.17 లక్షలతో నిర్మించిన భవనాన్ని పరిశీలించి దాతలను అభినందించారు.

ఎండీఎం ఏజెన్సీ నిర్వాహకులపై వేధింపులు ఆపాలి

నూజివీడు: ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ నిర్వాహకులపై స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ)ల వేధింపులు వెంటనే ఆపాలని ఏపీ మధ్యాహ్న భోజన పథకం యూనియన్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు చాట్ల పుల్లారావు పేర్కొన్నారు. నూజివీడు పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్‌లో 20 ఏళ్లుగా పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వహించే ఏజెన్సీని, కార్మికులను తొలగించాలని ఎస్ఎంసీ తీసుకొచ్చిన ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. పుల్లారావు మాట్లాడుతూ కొందరి కన్ను మధ్యాహ్న భోజన పథకంపై పడటంతో దానిని ఎలాగైనా హస్తగతం చేసుకోవాలనే దుర్బుద్ధితో తప్పుడు ఆరోపణలు చేస్తూ తొలగించాలని చూస్తున్నారన్నారు. గత 20 ఏళ్లుగా ఏజెన్సీని నిర్వహిస్తున్న పద్మతో పాటు ఇతర కార్మికులను తొలగించాలని ప్రయత్నించడం దారుణమన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు శోభారాణి, ఎల్.పద్మావతి, యు.కుమారి తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో వ్యాధులు దూరం

డీఎంహెచ్ఓ సుహాసిని

విస్సన్నపేట: వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి సుహాసిని అన్నారు. విస్సన్నపేట మండలం తెల్లదేవరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని కొర్రా తండాలో శుక్రవారం డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ ప్రదర్శన జరిపారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ఇంటి ఆవరణలోని నీటి తొట్టిలు, ఫ్రిజ్‌లు, కూలర్లు, పూల కుండీలు, పాత సామాన్లు, ప్లాస్టిక్ డబ్బాలు, ఖాళీ కొబ్బరిబొండాలు, పాత టైర్లలో నీరు నిలవకుండా చూసుకోవాలన్నారు. ఇంటిలోకి దోమలు రాకుండా కిటికీలకు మెష్‌లు ఏర్పాటు చేసుకోవాలని, దోమ తెరలు వాడాలని చెప్పారు. జిల్లా మలేరియా అధికారి మోతీబాబు, తెల్లదేవరపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసరావు, ఎంపీడీఓ రాట్నాలు, తహసీల్దారు లక్ష్మీకల్యాణి, ఈఓపీఆర్డీ శివకుమారి, సర్పంచి దారావత్ బోణి పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పోరాటం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

మైలవరం: విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పీవీ ఆంజనేయులు అన్నారు. మైలవరం సీపీఎం కార్యాలయంలో శుక్రవారం పోస్టర్లను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. ప్రజలపై విద్యుత్ భారాలు ఆపాలని, స్మార్ట్ మీటర్లు బిగించవద్దని డిమాండ్ చేస్తూ శుక్రవారం నుంచి మండల వ్యాప్తంగా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేలా కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యుత్ బాదుడు ఉండదని హామీ ఇచ్చి రూ.15,485 కోట్ల సర్దుబాటు చార్జీల భారం వేయడం అమానుషమన్నారు. గతంలో స్మార్ట్ మీటర్లు పగులగొట్టాలని పిలుపునిచ్చిన కూటమి నేతలే నేడు మీటర్లు బిగించాలని ఆదేశాలు ఇవ్వడం గర్హనీయమన్నారు. ఆనాడు మీటర్లకు వ్యతిరేకంగా హైకోర్టులో కేసులు వేసిన టీడీపీ నాయకులే నేడు చట్ట విరుద్ధంగా స్మార్ట్ మీటర్లు ఎలా ఏర్పాటు చేస్తున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు వజ్రాల వెంకటరెడ్డి, రావుల సుబ్బారావు, రావూరి రమేష్, ఎస్. ఇసాక్, లంక వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

మల్లేల(తిరువూరురూరల్): మండలంలోని మల్లేలలో విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి శుక్రవారం మృతిచెందాడు. మల్లేల గ్రామానికి చెందిన గుంజా మారేశ్వరరావు (37) ఇంటి ఆవరణలోని విద్యుత్ మోటారు పనిచేయకపోవడంతో శుక్రవారం వైర్లు పరిశీలిస్తుండగా కరెంటు సరఫరా అయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన కూలి పనులు చేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మారేశ్వరరావు మృతితో తాము దిక్కులేని వారమయ్యామని కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. మారేశ్వరరావు మృతదేహానికి తిరువూరు ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్లోరోసిస్ నివారణపై అవగాహన అవసరం

ముసునూరు: ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన, నిర్ధారణ, నివారణ తదితర అంశాలపై వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జిల్లా కన్సల్టెంట్ వైద్యాధికారి డాక్టర్ బద్రీనాథ్ తెలిపారు. శుక్రవారం కాట్రేనిపాడు జెడ్పీ హైస్కూల్‌లో ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. తాగునీరు, వంట అవసరాలకు మినరల్ వాటర్‌ను మాత్రమే వాడాలని, ఇతర భూగర్భ జలాలను ఉపయోగించరాదని సూచించారు. అనంతరం కమ్యూనిటీ సర్వేలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ఫ్లోరోసిస్ వ్యాధిపై పలువురికి అవగాహన కల్పించారు.